# అంబరాంబుజాలు

రామనారాయణ ఒక రచయిత. లోకంలో అతడు విమర్శించబడినంతగా మాస్నేహితులలో మరెవ్వరూ విమర్శించబడలేదు.

మాపూర్ణయ్య మొదటినుంచీ శకునపక్షి అనీ (శకుని అనీ) బిరుదు సంపాదించిన మనిషి, హాయిగా ఇంట్లోనూ, వీథిలోనూ తంటాలుపెట్టుకుంటూ గుమాస్తాపని అఖండంగా చేసుకొంటున్నాడు. వాడిగురించి ఎవ్వరికీ ఏవిచారమూ లేదు.

సుబ్బారావు స్కూలుఫయినలుతో చదువుమానేసినా, అదృష్టవశాత్తు రైల్వేలో ఉత్తరాదిలో ఏదో ఉద్యోగంలభించింది. అక్కడ వాడు ఎలా ఉంటున్నాడోకాని, ఇటువేపు వచ్చినప్పుడల్లా సూటులోనే ఉంటాడు. వాళ్లఆఫీసు గొప్పతనమూ, ఆఫీసర్ల జీతాల వివరాలూ అన్నీ తనవయినట్లుగానే కబుర్లుచెప్తాడు. వాణ్ణిచూసి ఎవళ్లూ జాలిపడరు. చాలామంది బంధుమిత్రులు ప్రయోజకుడంటారు. ఆమాటతో ఏకీభవించనివాళ్లు సామాన్యంగా మాట్లాడకుండా ఊరుకుంటారు- ఒక్క రామనారాయణ తప్ప.

---

* 1947 డిసెంబరు 31వ తేదీ ఆంధ్రవారపత్రికలో తొలుతప్రకటిత మయినది.

సంజీవరావుకి స్వంత దుకాణం ఉంది. స్కూలుచదువులో కనబడని తెలివితేటలు దుకాణం నడపడంలో అద్భుతంగా బైటపడ్డాయి. ఇప్పుడున్న ఇల్లు పడదోయించి పెద్ద సిమెంటుమేడ కట్టిస్తాడట. వాణ్ణి చూసి ఎవళ్లయినా ఈర్ష్య పడాలి గాని, జాలిపడ నక్కరలేదు.

ఇక నేను – నాగురించి చెప్పవలసింది చాలా ఉంది. (ప్రతివాడికీ తనగురించి లోకానికి తెలియజేయవలసిందిచాలా ఉన్నట్టే ఉంటుంది). కాని ఇక్కడ జాగా చాలదు. సమయం కూడా కాదు. నేనూ చాలా ఆశలకూ, ఆశయాలకూ స్వస్తి చెప్పి, హెల్తు ఇన్‌స్పెక్టరు గిరీ అనే పడవతో దైనిక చర్య అనే నదిని ఈదుకొని వస్తున్నా ననడం చాలును ప్రస్తుతానికి.

ఇంకా ఎందరెందరో ఉన్నారు–రామ్మూర్తి, నరసింహం, కాళిదాసు, రంగారావు, నారాయణశాస్త్రి, వెంకటరమణ రావు– అందరూ అన్నిరకాల జీవితమార్గాలనూ అనుసరిస్తున్నారు. అందరిగురించీ లేని ఈజాలిపడడమూ, విమర్శనా ఒక్కరామనారాయణగురించే ఎందుకు రావాలి?

* * *

రామనారాయణకి తల్లిదండ్రులను పోగొట్టుకొన్న దుఃఖమూ స్వేచ్ఛా రెండూ చిన్నతనంలోనే లభించాయి.

అందుకు ఫలితంగా అతని స్కూలుచదువు స్కూలు ఫయినలు పూర్తికాకుండానే సాంత మయింది.

ఆమాత్రం చదువుతో అతను ప్రయత్నిస్తే ఏదో ఒక పని దొరికి ఉండును. కాని, తనకు దొరకడానికి సావకాశం ఉన్న ఉద్యోగాలమీద అతనికి మోజులేదు.దొరకనివిఎల్లానూ దొరకవు. ఇంతకీ అంత అవసరం వెంటనే కనబడలేదు. తరిమి చెప్పేవాళ్లుకూడా లేకపోయేరు. రాగాపోగా అతడు నిరుద్యోగిగా ఉండిపోయేడు. మొదట్లో ఏ పెద్ద ఉద్దేశమూ లేకపోయినా, రానురాను తాను ఉద్యోగం చెయ్యకపోడానికి ఎన్నెన్నో కారణాలను కల్పించుకొన్నాడు రామనారాయణ. అతడిమీద వచ్చే విమర్శనల్లో అతడు ఉద్యోగం చెయ్యకపోడంకాదు, అందుకుప్రయత్నించకపోవడం ఒకముఖ్యాంశము.

"ఎందుకు ప్రయత్నిస్తాడు? అబ్బే ఆ ఉన్ననాలుగు రాళ్లు ఐపోతేనేగాని బుద్ధిరాదు."

"తానేం చమటోడ్చి గణిస్తేకదూ డబ్బులోఉండే విలువ తెలియడానికి? చెయ్యకాల్తేకాని ఆకులు పట్టుకోడు. ఇలా ఖర్చు పెట్టుతూ, ఎంతలేసి వాళ్లనీ కాదంటూ పెద్దపెద్ద కబుర్లు చెప్పినట్టుకాదు. ఆర్జించమను — అప్పుడు చూస్తాం అయ్యగారిప్రజ్ఞ."

"పితృపితామహార్జితమైన భూములు ఇప్పటికే సగం పైగా అమ్మేసేడు. మరొక్క పదేళ్లనాడు దమ్మిడీకి గతిలేని భికారి కాకపోతే నేను చెవి కదపాఇస్తాను"

—ఇది బంధువుల్లో అతణ్ణిగూర్చిన సంభాషణ వైఖరి.

బంధువుల్లో అతడికి పెద్దస్థానంలేదు. ఎల్లా వస్తుంది? పెద్ద రాబడి లేదు. ఉద్యోగమైనాలేదు. అంతకంటె యేం కావాలి? — అప్రయోజకుడుగా లోకంలో లెక్కకి రావడానికి? కాని, అతడికిమాత్రం తనమీద తనకి చాలా గౌరవం ఉంది. ఆగౌరవభావం ఇతరులలో లేనప్పుడు దానిని రాబట్టడానికి ప్రయత్నించి లాభం లేదన్న సంగతి అతనికీ తెలుసును.

అందమూ, ఆనందమూ, అంటే ఏమిటో తెలుసుకోని బంధువుల సంకుచితత్వాన్నీ, తాను సుఖపడకూడదు, తమకంటె గొప్పవాడు కాకూడదు అన్న అసహనాన్నీ అతడు సహించలేకపోయేడు. ఉపేక్షను, ఉదాసీనత్వాన్ని అమితంగా ప్రదర్శించి వాళ్ల ఒత్తిడి తగ్గించుకోగలిగినందుకు తనను తాను అభినందించు కొన్నాడు.

తాను నిజంగా కాలాన్ని వ్యర్థపుచ్చుతున్నాడా?

లేదే — తాను ఎన్నెన్ని ఉద్గ్రంథాలు చదివి జీర్ణం చేసుకొన్నాడు! ఎంత సూక్ష్మంగా ప్రకృతిపరిశీలనం సాగించాడు! తాను ఏగుమాస్తాపనో చేసుకుంటూనో, ఉండిన మడి

చక్కలు దున్నుకుంటూనో వుండే మాట్లైతే, తాను సముపార్జించిన ఈజ్ఞానమంతా లభించడానికి వీలుందా? తన రచనల్లో తన విజ్ఞానం అంతా ప్రతిఫలించవద్దూ?

వాళ్ల కిదంతా అర్థమయితేకదూ? "మహా ఏమిటి రాశాడు లెద్దూ. ఈమాత్రానికి ఉద్యోగం చెయ్యడంమానుకోడం ఏమిటి? పోనీ అంతగా వ్రాసుకోవాలంటే, ఏదో పని చేస్తూనే గంటో, రెండుగంటలో రోజుకి వ్రాసుకోకూడదా" అంటారు. అలాచేయడానికి దేమీ మనసూ హృదయమూ లేని వ్యాయామమూ అని నవ్వుకొనేవాడు రామనారాయణ.

తన రచనలను అప్పటప్పట చూసికూడా తనకు ఇవ్వవలసిన కనీసస్థానాన్ని ఇవ్వకపోవడం పరమఅన్యాయంగా రూపిస్తుంది రామనారాయణకు.

అయితే ఒకనాడు ఈ ధోరణి అంతా మారుతుందనీ, తనను పనీ పాటూ లేనివాడని అన్నవాళ్లే తనను ఎంతో గొప్పవాడనీ, తన పనిని ప్రపంచంలోని చాలా ముఖ్యమైన పనుల్లో ఒకటి అనీ, అనవలసివస్తుందని అతడిదృఢవిశ్వాసము.

ఎవరికి తగిన స్నేహితులు వారికి లభిస్తూవుంటారు. రామనారాయణ స్నేహితులందరూ అంతో ఇంతో రచయితృ లక్షణాలు కలవాళ్ళే.

బంధువులలో మృగ్యమయిన సౌజన్యమనే సుగుణం అపారంగా గోచరించింది రామనారాయణకు తన స్నేహితులలో.

బంధువులతో మాట్లాడినప్పటివలె స్నేహితులతో ఎంతసేపూ ఇళ్లూ! వాకిళ్లూ, భూములు, ఆస్తి, అప్పు, మొదలయిన వాటిగురించి మాటాడనక్కరలేదు. సంఘం గురించి, దేశం గురించి, ప్రపంచం గురించి, మతంగురించి, మానవజాతి గురించీ సోల్లాసంగానూ, సోద్వేగం గానూ చర్చించవచ్చును. తాము ఎంతో ఉన్నతులయినట్లు పరస్పరం నచ్చజెప్పుకో వచ్చును.

ఇక తను యథాశక్తి స్నేహితులకు కాఫ్యాదులు సరఫరా చేసినా, చేయకపోయినా చిక్కులేదు. చేస్తే ఒక లాంఛనం, చేయకపోతే ఒక ప్రత్యేకత.

ముఖ్యంగా స్నేహితులెన్నడూ తన ఆర్థికవిషయాలను చర్చలోనికి తీసికొని రారు. అంతేకాదు, తాను సిగ్గుపడవలసిన విషయాలే ఉన్నట్లు తోచవు స్నేహితులమధ్య అతనికి.

స్నేహం చాలా ఉన్నతమయినదిగా తోచింది రామనారాయణకి. అందులో ముఖ్యంగా ఒక రిద్దరితో స్నేహం జన్మజన్మాలనుండి వస్తున్నదేమోనన్నంత గాఢంగా హత్తుకొన్నది. చాలా విషయాల్లో అభిప్రాయాలు ఏకమయేయి.

పై విధంగా స్నేహాన్ని గురించి ఊహించిన రోజులను తలచుకొని రామనారాయణ ఇప్పు డేవిధంగా ఊహిస్తు న్నాడో! కాని, తన సాహచర్యం మూలంగానే తన స్నేహితులు ఈమాత్రంవాళ్లు కాగలిగేరని ఇప్పటికీ నమ్ముకొంటున్నా డనడానికి సావకాశం చాలా తక్కువ.

* * *

స్నేహంకూడా కొన్నాళ్లకి నీరసంగానూ భారంగానూ కనిపించింది రామనారాయణకి! బంధువులు సూటిగా హిత బోధ అనే పేరుతో తమలోని విషాన్ని (కుళ్లును) వెళ్లగక్కు తారు. స్నేహితుల్లోనూ అది ఉండకపోదు. అంతకంటెకూడా ఎక్కువగా ఉంటుందేమో, తామూ ఒక క్షేత్రంలో కృషి చేయటం చేత! అయితే, ఈవిషయాల్ని వీళ్లు అతినేర్పుగా అణచి ఉంచుతారు. తనను పొగుడుతున్నట్లే వుండి, వెనకా తల, తమ మహా తెలివి తేటలకీ, వ్యవహార దక్షతకీ తనను అపహాసం చేస్తారు. (చెత్త) పత్రికలలో తమపేరు అచ్చయి నప్పుడల్లా ఊరంతా డప్పువేసుకొని చాటే పెద్దమనుష్యులు కూడా తననుగురించి జాలికబుర్లు తేలికగా చెప్పడమే. నిన్న మొన్నటి రెక్కలు రాని రచయితలు కూడా తమకూ ఏవో అభిప్రాయాలూ, ఒకశైలీ ఉన్నట్లు మాట్లాడబోతే రామ నారాయణ నవ్వుకోకుండా వుండలేడు! వాళ్ల ఊసెందుకు

వాళ్లకు ఆరాధ్య దైవతములవంటి మహాపేరుపొందిన రచయితలే తనకంటికి అతిసామాన్యులుగా కనిపిస్తూఉంటే –

'ఏమిటిపోనిద్దూ...లో ఎంతసేపూ భాషాఘటాటోపమే కాని అసలు లోతూ, మన స్తత్వవిశదీకరణమూ ఇవేవీ లేవు.

"ఆఁ సరే...గుర్తించా? మన తెలుగులో అసలు ఆ రకం రచన అంటూ వుంటే కదూ. అందుచేత సరే, తెలుగువాళ్లలో అంటే నాకేం అభ్యంతరం లేదుకాని, అతణ్ణి ఒక పెద్ద రచయితగా చెప్పకండి.

"......యేనా—ఇంకా అమ్మమ్మ కథలుచెప్తూంటే, సారస్వతం ఇంత అభివృద్ధిపొందిన ఇరవయ్యో శతాబ్దంలో కూడా ఏవో పాతపద్ధతులను పట్టుకొని ఛాందసంగా జిడ్డోడుతూ – ఎందుకూ అది ఇంగ్లీషులోకి అనువదించి చూడండి, అప్పుడు దాని నిజమయిన విలువ బైటపడుతుంది.

— ఇదీ తెలుగు రచయితలగురించి అతడి ధోరణి. అతడి దృష్టికి ఆగే రచయిత అంటే, అధమం ఒక నోబెల్ ప్రైజు (Nobel Prize) పొందినవాడో, పది పదిహేను భాషలలోకి అనువదింపబడిన పుస్తకాలు కలవాడో అయివుండాలి.

రానురాను అతడికి స్నేహితులుకూడా నచ్చకపోడానికి వాళ్లలో తాను మెచ్చుకోదగినంత ప్రతిభ లేకపోవడమే

కాకుండా, తనప్రజ్ఞావిశేషాలను సరిగాఅర్థంచేసుకోలేని గొప్ప లోపం ఒకటి ఉండడమే కారణం.

తనతో ముఖాముఖి అనకపోతే నేమి, బంధువులలో వున్నటువంటి అభిప్రాయాలే వాళ్లలోనూ తన గురించి వున్నాయి. వాళ్లంతా దినం గడవకో, సారస్వతంమీద విశ్వాసం లేకో ఏవేవో ఉద్యోగాలను ఆధారం పెట్టుకొని యథాశక్తి ఉడతాభక్తి అన్నట్లుగా సారస్వతసేవ చేస్తున్నారు. అటువంటి వాళ్లు కేవలం సాహిత్యంకోసమే జీవితాన్ని మీదుకట్టిన తనను తేలికగా చూస్తున్నారంటే వింత ఏముంది?

తా నొక రచయితగా గొప్పవాడు కావాలి. తన్మూలంగా బాగా ఆర్జించాలి; తను వృథాగా గడిపేడనుకొన్న కాలమంతా ఎంతఉత్కృష్టమైనదో ప్రపంచానికి తెలిసిరావాలి. ఇప్పుడు తనను ఈసడించిన ప్రపంచమే తనకు అప్పుడు బ్రహ్మరథం పట్టుతుంది. అంతవరకూ స్నేహితులూ, బంధువులూ, అందరూ కంటకప్రాయులే.

నిజానికి గాయమన్నది ఉంటే, మరేదీ గ్రుచ్చుకోకపోయినా నొప్పిగానే ఉంటుంది. ఆ నొప్పికోనే అతడు స్నేహాన్నికూడా అతినేర్పుగా తాబేలు తనతలను కాళ్లను లోపలకు లాక్కున్నట్లుగా ఉపసంహరించుకొన్నాడు.

ఒంటరిగా నిశ్చలంగా తపస్సుచేయసాగాడు, తనప్రతిభను లోకంముందు అద్వితీయంగా ప్రదర్శించే సిద్ధికోసం.

అతడి తపఃఫలిత మేమిటో తేలేవరకూ లోకం ఊరుకోగలదా?

"మును పేమిటో రాసేవాడు, ఇప్పు డదీ లేదయ్యా—అంతే, ఇక మరి రాసేదేమిటిలే" అని కొందరూ —

"వ్రాయవచ్చును, కాని అంత స్వల్పంగా రాయడానికి ఏమిటో కొండను త్రవ్వి ఎలుకను పట్టడం, నాకేం నచ్చలేదు —" అని మరిగొందరూ—

"ఈమారు మన అందరిమీదా ఉంటుందికాబోలు దాడి! నేనుగాని ఏమీ, చేబదులు పుచ్చుకుని మరిచిపోలేదు కదా— చిరస్థాయిగా పుస్తకంలో పేరుండిపోతుంది" అని కొందరు సన్నిహితులూ—

"ఏమి వెఱ్ఱిమాటలు! మరొక పదేళ్ళయినా పట్టదా, ఈడెబ్బై పేజీలగ్రంథం తయారుకావడానికి......" అని వారి స్నేహితులూ.

"పదేళ్ళలో రావడం నిశ్చయమేనంటావు. ఏమో నాకది వట్టి గగనారవిందమో ననిపిస్తున్నది" అని వారి హితకాంక్షులూ.

"గ్రంథం గురించి అలా అనడానికి వీల్లేదు. ఎప్పటి కయినా వచ్చితీరుతుంది. అయితే అందులో ఏవిషయాలుం టాయో, ఇవాళకావలిస్తే నేనువ్రాసి ఇచ్చేస్తాను" అని కొం దరు సాహిత్య జ్యోతిష్కులూ—

"ఏదో రాస్తున్నామంటే బాధ లేదయ్యా, ఆ కబుర్లూ ఆశలూ చూస్తే మిన్ను ముట్టిపోతుంటాయి—"

"అవే అంబరాంబుజాలు –

– ఇదీ అతడి రచనలగురించిన ప్రాసంగిక ధోరణి.

ఇంకా అతనితో ప్రత్యేకవ్యక్తిగత కారణాలవల్ల వైమనస్యాలు వచ్చిన కొందరు పత్రిముఖులచేత అతడే ప్రధాన పాత్రగా కలిగిన రెండు మూడు నీతిబోధకము లయిన కథలు విరచించ బడ్డాయి—నీతిబోధకములని ఎందుకు చెప్పవలసి వచ్చిందంటే అవి: "చెరపకురా చెడెదవు" మొదలయిన వాచక పుస్తకాలలోని కథలవలె—ధనంలో మునిగి తేల్తున్న వారు తప్ప, తక్కినవారెవ్వరూ రచయితలుకావాలని ప్రయ త్నించటం పరమ అవివేకం—అనే అత్యుత్కృష్టమైన నీతిని అవి ప్రబోధిస్తున్నాయి—ఏదో కాలక్షేపానికి తప్ప పత్రి కల్లో కథలంటే శ్రద్ధా, గౌరవము చూపే బుద్ధిమంతులు లేక కాని, బాగుపడాలంటే వాటిల్లో అంతటి గొప్పనీతి సందే శము గర్భితమై ఉన్నాయి.

వాటిలోని వివరాలు ఏమయితేనేమి, అతడి ఆశలూ ఆశయాలూ అంబరాబ్జాలేనని, అతడు అతి దీనుడుగా, నిశ్చేష్టుడుగా, అందని పండ్లకు అఱ్ఱులుచాచి నిట్టూరుస్తున్నట్లుగా చిత్రించ బడ్డాడనీఅంటే చాలును.

ఈ రకపు రచనల నన్నిటినీ పూర్వపక్షం చేస్తూ రామనారాయణ తన అస్త్రాన్ని, కొంచెం ఆలస్యం _ నయితే నేమి, ప్రయోగించక పోలేదు.

ఇది పదేళ్ళకిందటి మాట —

* * *

నేటి తెలుగు రచయితల్లో రామనారాయణకు ఒక స్థానం లేకపోలేదు.

కాని ప్రపంచధోరణిమాత్రం కేవలం అతడు ఊహించిన రీతినే మారినట్లు లేదు. మొదట్లో తన బంధువులూ, స్నేహితులూ తన ప్రత్యేకతనూ, గొప్పతనాన్నీ ఒప్పుకోనట్టే నేడు తెలుగుదేశం అతి సంకుచితంగా తనకు ప్రథమతాంబూలాన్ని ఇవ్వడానికి ఎన్నో వంకలు చెప్తూ తన లుబ్ధత్వాన్ని ప్రదర్శిస్తున్నదనీ, ఇదే మరోదేశం అయితే తానింతకంటె ఎన్నోరెట్లు గొప్పవాడయి ఉండుననీ అనుకోకుండా ఉండలేదు. అంతేకాదు, పై భాషలనుండి, దేశాలనుండి వాని తనకు కీర్తి వస్తే అప్పుడు ప్రపంచం అంటే తెలుగుదేశం తనకు బ్రహ్మ

రథం పట్టుతుందని అతడి విశ్వాసము. మునుపూ ఇలాగే అనుకోనేవాడు. తన బంధువుల గురించీ స్నేహితులగురించి— ఇప్పుడు తెలుగు వాళ్లందరిగురించీ ఊహిస్తున్నాడు. సంఖ్యలో విస్తృతిలో భేదముతప్ప ధోరణి ఎప్పటిదే.

అతనికి కాదనే వార్లకూ సావకాశం లేకపోలేదు. అతడికి పేరువచ్చినపాటి డబ్బురాలేదు. ఆ పేరైనా అతడి ఆశల, ఆశలయాలమానంలో కొలిచినప్పుడు ఏలేశమూకాదు. అతడి ఆశలు అంబరాంబరాలే! ఏమీలేకుండా కబుర్లు చెప్పగానే సరా!

* * *

కబుర్లు చెప్పడమూ ఒక దోషమేనా? రచయితలయి కానివాళ్ళము సైతం మహారచయితల గురించే, మహాత్ముని గురించి హెచ్చుగానో తక్కువగానో కబుర్లు చెప్పడంలేదూ? అల్లాగే అతడూను. మామూలు మనిషిగా కాక, ఎల్లప్పుడూ అతణ్ణి రచయిత అనే ఒక యంత్రంగా ఎందుకు చూడాలీ, అయితే సర్వదా తానొక రచయితననే బురఖావేసుకుని అదే తానన్నట్లుగా లోకంలో అతడు ప్రవర్తించటమే ఆ రకం చూపుకు కారణమయి ఉంటుంది.

అలాకాకుండా రామనారాయణ సామాన్య మానవుడుగా ప్రపంచంతో హృదయపూర్వకంగా కలిసిమెలిసిఉన్నట్లయితే, అతని రచనలు ఇప్పటికంటె ఎన్నోరెట్లు సహజంగా సజీవంగా, సునిశితంగా సుందరంగా ఉండిఉండునేమో!

తెలుగు సాహిత్యమనే బంగారానికి ఇంకొక వన్నె వచ్చియుండును!

ఎన్ని వచ్చినా, ఏమయినా అంబరాంబుజాలు అంబరాంబుజాలే! అని మనం ఎంత ఎత్తుకువెళ్ళినా ఊహకుసైతం అందీఅందనట్లుగానే ఉంటాయి.